ఓ వెయ్యం కథ

- అనామక్

చూస్తుండగానే..

అన్నపూర్ణ మెస్ షట్టర్ దింపేసి తాళం వేశాడు బాబూరావు.

నా కడుపులో ఆకలిని పెట్టి తాళం వేసినట్టనిపించింది నాకు. మాణిక్‌చంద్‌ను చింపి నోటి నిండా నింపుకుని ఖాళీ ప్యాకెట్‌ను చిద్విలాసంగా విసిరేసి - నా వేపు ఓ బూర్జువా చూపుపారేసి స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు బాబూరావు.

"ఓ ప్లేటు మీల్స్ బాస్ .. మొత్తం రేపిచ్చేస్తా.."

ఎమ్మెస్సీ చదివే రోజుల్లో ఎమ్సీ బ్రాందీ ఏడు పెగ్గులు లాగించేసి - యాభై నోటు బేరర్‌కిస్తే.. 'చేంజ్‌లేద్సార్' అన్నప్పుడు 'ఉంచుకో' అని ఠీవిగా పలికిన నాలుక.. ఈ రోజు దీనంగా ప్లేట్ మీల్స్‌కోసం బాబూరావును బ్రతిమాలుతుంటే.. నాకేం బాధనిపించలేదు.

'రేపు నెల బాకీ ఇచ్చాక ఫుల్‌మీల్స్ తీసుకో.. ఈ రోజుకు సారీ..' బాబూరావు మొహమాటం లేకుండా అన్నప్పుడు నాకు సిగ్గూ అనిపించలేదు. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ లేబుల్ అంతరాత్మ మీద అతికించి జీవితంతో రాజీపడడం నేర్చుకున్నవాడిని. సిగ్గు నన్నుచూసి సిగ్గుపడి పారిపోయి చాలాకాలమైనట్టు గుర్తు.

మాసిపోయిన జీన్స్‌ప్యాంటు జేబులో చేయి పెడితే రెండు నాణాలు చల్లగా తగిలాయి. ఒకటి అయిదు రూపాయలు - ఇంకోటి రెండు రూపాయలు - ఏడు రూపాయల ఆస్తిపరుడిని. అన్నానికి తక్కువ - టీ నీళ్ళకు ఎక్కువ! రెండున్నర పెట్టి టీ తాగి - రెండు రూపాయల విజయ్ సిగరెట్ ప్యాకెట్ కొనుక్కుంటే - ఇంకా రెండున్నర మిగులుతుంది. అమీర్‌పేట చౌరస్తా దగ్గరకొచ్చి ఆఖరి సిగరెట్ వెలిగించి గుండెలనిండా పీల్చి - తృప్తిగా పొగవదిలి ఇంటలెక్చువల్ లుక్‌తో రోడ్డు మీదకు చూశాను.

వేగంగా పరిగెత్తే వాహనాలు - కంగారుగా నడిచే జనం - సెకండ్ షోకి హడావుడిగా వెళ్తున్న ఆడవాళ్ళు.. రంగులు మార్చుతున్న ట్రాఫిక్ సిగ్నల్ .. అరటిపళ్ళ బేరం చేస్తున్న గుమాస్తా.. రోడ్ డివైడర్ మీద పడుకున్న బిచ్చగాడు.. అంతా చాలా సిల్లీగా కనిపించారు.

గమ్యంలేని జీవితాలు - ఈ రోజుకు రాత్రి గమ్యం - రాత్రికి వేకువ గమ్యం.. వేకువకి సంధ్య గమ్యం.. సంధ్యకి..

అన్నట్టు.. సంధ్య..!!

"నువ్వు ప్రభాతానివా? విభాతానివా?.."

అంటే..

'విఘాతాల అగాధాన్ని' అనేది - ఫైనలియర్లో ఆ మాటలో శ్లేషకోసం వెదికే ఆరాటం..

'శ్లేష లేదు - శేషం లేదు శేషూ.. విశేషం ఏమైనా ఉందేమో ఆలోచించు' అనేది. విశేషం అర్థమయ్యే లోపునే విదేశాల్లో ఉన్న బావొచ్చి ఎగరేసుకుపోయాడు. ఓర్నాయనో.. ఇంకేంటి ఆలోచిస్తున్నాను? కాసేపాగితే ఇరానీ హోటల్ కూడా మూసిపారేస్తారు. అప్పుడు మంచినీళ్ళే గతి - అన్నట్టు ఉదయం మంచినీళ్ళు కూడా పట్టుకోలేదు. రెండు నెలల అద్దె ఇవ్వలేదని ఓనరుడు నాలుగు రోజులకోసారి రెండు నిమిషాలు నీళ్ళొదుల్తున్నాడు... అంచేత శేషూ.. రేయ్ నాయినా.. నడవరా.. వేడి వేడి పొగలుకక్కే కమ్మటి చాయ్ తాగు..

"చల్లటి నీళ్ళు కలుపుకుని ఐస్ క్యూబ్స్ వేసుకుని తాగే ఈ విస్కీని హాట్‌డ్రింక్ అంటారెందుకు శేషూ..?"

విస్కీ తడితో ఇంకా ఎర్రగా మెరిసే పెదవులను నాలుకతో తడిచేసుకుంటూ హస్కీగా అడిగే ఓ.జి.హెచ్ స్టాఫ్ నర్స్ సరోజ గుర్తొచ్చింది. తనమీద కవిత్వం చెపితే - తాగినంత విస్కీ, తిన్నంత బిర్యానీ - సాకీ సంగతేమోగానీ ఉమర్‌ఖయ్యాం సరోజను చూస్తే - నా మీద జెలసీతో రుబాయీలు రాయడం మానుకునేవాడు!

టీలాగి బయటకొచ్చి - సిగరెట్లు తీసుకుని ఓ సిగరెట్ వెలిగించి రోడ్ క్రాస్‌చేసి ఇవతలకొచ్చాను. అరగంట నడిచి గేటు చప్పుడుకాకుండా తీస్తుంటే నిమ్మి నావేపు కోపంగా చూసింది. నేను భయంగా నవ్వాను నిమ్మీ అరిస్తే ప్రమాదం. ఓనర్ గేటు దగ్గర నిలేసి అద్దె అడుగుతాడు.. అదృష్టం.. నిమ్మి అరవలేదు. గుర్తుపట్టి తోకాడించింది. మనుషులకన్నా కుక్కలే నయం.. ఫీలింగ్స్ అర్థం చేసుకుంటాయి.

రూం తాళం తీసి తలుపు తీయగనే మనీషాకోయిరాలా 'హాయ్' అంది గోడ మీద. 'హాయ్ బేబీ' బుగ్గమీద చిటికేసి చాపమీద వెల్లికిలా పడుకున్నాను. అలా పడుకుంటే కడుపు ఖాళీ అయి ఆకలి ఎక్కువవుతున్న ఫీలింగ్ - బోర్లా పడుకున్నాను. 'లాభంలేదు - రేపు చక్రవర్తి దగ్గరకెళ్ళి రెండు కథల్రాసి రెండొందలు తెచ్చుకోవాలి!'

మంటలు.. మంటలు!

కాలిపోతున్న ఆశలు - బూడిదవుతున్న అనుభూతులు.

కెమిస్ట్రీలో కవిత్వం కనిపించక - మల్లెపూల పరిమళానికీ, రసాయనాల కంపుకీ పొత్తుకుదరదనీ - అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డ్‌కీ చేస్తున్న లెక్చరర్ ఉద్యోగానికీ తేడా కనిపించక.. కవిత్వం తిండి పెడుతుందన్న ఆశతో - ఉద్యోగం వదిలేసి ప్రపంచపు యంత్రనగరిలో అడుగు పెట్టి ఆ మాయాజాలపు జిమ్మిక్కులకు మతిపోయి - రాసిన కథలు నకల్లు పట్టుకుని ఎన్నెన్ని పత్రికాఫీసుల మర్రినీడల్లా మల్లెతీగ ల్లావాలని ప్రయత్నించానో.. నా అనుభవాలు - అనుభూతులు - కష్టాలు అన్నిటికీ అక్షర రూపం ఇచ్చి అచ్చులో చూసుకోవాలన్న నా ఆశ - దివా స్వప్నమే అని బుజువైనప్పుడు.. ఆ రాత్రేకదూ.. మొత్తం కాగితాలను కుప్పగాపోసి సరోజకానిచ్చిన విస్కీపోసి తగలేసిందీ..!

చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తూ కడుపు నింపుకుంటున్న రోజుల్లో అప్పుడు పరిచయమయ్యాడు చక్రవర్తి. నా అవసరాన్ని చాలా అందంగా ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్న నిజం నాకు అర్థమయ్యేసరికి - చక్రవర్తి ప్రముఖ రచయితయిపోయాడు!

నవలకు నాలుగు వేలు - కథకు వంద.

బ్రతకటానికి డబ్బుకావాలి - ఆ డబ్బు కోసం రాశాను - కసిగా - కోపంగా - ఆవేశంగా... నెలకు రెండు నవలలు - కొన్నిసార్లు రోజుకో కథ. సంవత్సరానికి ఓ నవల అతికష్టంమీద రాసి అచ్చువేయించుకునే చక్రవర్తి సంవత్సరం తిరిగేసరికి ప్రముఖ రచయితల జాబితాలో చేరిపోయాడు. సన్మానాలు - బిరుదులు - అవార్డులు - అభిమానులు.. స్కూటర్ నుంచి కారు స్థాయికి ఎదిగాడు చక్రవర్తి. ఉధృతమవుతున్న టీవీ ఛానెల్స్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం సాహిత్యం వేపు కన్నెత్తి చూడటం లేదన్న సాకుతో పబ్లిషర్లు నవల్లు వేయడం మానుకుని బూతుపుస్తకాలు వేసుకుంటున్నారని చెప్పి దాదాపు ఆరు నెలలుగా నాకు డబ్బులివ్వడం మానేశాడు చక్రవర్తి. అప్పుడో వేయి అప్పుడప్పుడు ఓ అయిదొందలు.. రెండొందలు.. వందా.. అంతే..!

ఆరు కిలోమీటర్లు నడిచి -

చక్రవర్తి ఇంటికొచ్చి డోర్‌బెల్ నొక్కాను.

రాత్రి టీ, సిగరెట్లకు పోను - మిగిలిన రెండున్నరతో ఉదయం టీతాగి ఇక్కడికి బయల్దేరాను. ఇంకా నాలుగు సిగరెట్లు తప్ప - చిల్లిగవ్వలేదు జేబులో..

చక్రవర్తి తలుపుతీశారు. విష్ చేశాను.

'ఏంటి శేషూ.. ఏంటి విశేషం?' ఎవరితోనో 'సెల్'లో మాట్లాడుతూ నన్నుచూసి నవ్వి అన్నాడు. నేను లోపలికొచ్చాను. కూర్చోమన్నట్టు సైగ చేశాడు. కూర్చున్నాను.

టీపాయ్ మీద ఈవారం పత్రిక.. ఇందులో నా సీరియల్.. కాదు.. నేను చక్రవర్తికి రాసిచ్చిన సీరియల్ వస్తుంది. పేజీలు తిరగేశాను.

ఛ.. నేనింకా మారాలి.. ఇంకా.. ఇంకా.. నా మనసు రాయికావాలి.

నా పేరు మీద సీరియల్ వేస్తే - ఈ ఆర్టిస్ట్‌చేత ఇలస్ట్రేషన్స్ వేయించుకోవాలని కలలుకన్నాను. అప్పట్లో అది నా ఫాంటసీ - ఇప్పుడు చక్రవర్తి పేరుమీద వస్తున్న ఈ సీరియల్‌కి అదే ఆర్టిస్ట్ బొమ్మలు వేస్తున్నాడు.

అయితే మాత్రం.. నా కళ్ళలో ఈ నీటితెరెందుకు..?!

'చెప్పవోయ్.. ఏంటి సంగతి?' సెల్ ఆఫ్‌చేసి అన్నారు చక్రవర్తి.

'ఏమీలేద్సార్ - రెండు కథలు రాద్దామని వచ్చాను'

'వెరీగుడ్ - నేనే నీకు కబురు చేయాలని అనుకుంటున్నాను. కథల పోటీ ఎనౌన్స్‌చేశారు. అఫ్‌కోర్స్ - ఫస్ట్ ప్రైజ్ మనకే - కనఫర్మ్ అయిపోయింది. మంచికథ ఒకటి రాయి' అన్నారు.

'రెండు రాస్తా సార్' అన్నాను.

'నీ ఇష్టం - కానీ బాగుండాలి" అన్నారు.

ఆ ఇంట్లో నాకోసం ఏర్పాటుచేసిన గదిలోకి వెళ్ళి సంధ్యను - నాలుగు నెలల క్రితం వదిలేసిన మొగుడి దగ్గరకెళ్ళిపోయిన సరోజనూ హీరోయిన్లుగా చేసి రెండు అద్భుతమైన కథలు రాసి చక్రవర్తికిచ్చాను. చక్రవర్తి చదివారు. నవ్వి అన్నారు.

'బావున్నాయోయ్ - పోటీకి ఏ కథ బాగుంటుంది?'

'మీ ఇష్టం' అన్నాను.

'సరేలే - ఏదో ఒకటి పంపిస్తా - ఏంటి విశేషాలు?' అన్నారు.

రెండొందలిస్తే - అర్జంటుగా మెస్‌కెళ్ళి కడుపునిండా ఫుల్ మీల్స్ తినాలి - అదే విశేషం. మాట్లాడలేదు.. నవ్వాను.

'ఈ రోజు శనివారం కదా - బ్యాంక్ టైమ్ అయిపోయింది. రేపాదివారం. ఎల్లుండి వచ్చి డబ్బు తీసుకెళ్ళు' కథలు టేబుల్ డ్రాలో పెడుతూ అన్నారు.

'అలాకాద్సార్ - ఇప్పుడు డబ్బు అవసరం - అందుకే..'

'కరెక్టే - కానీ నువ్వొస్తావని నేనూహించలేదుగా - నీ డబ్బు ఎక్కడికీ పోదు - సోమవారం వచ్చి తీసుకెళ్ళు' అన్నాడు.

రెండొందల కోసం బ్యాంక్‌కు వెళ్ళాల్సిన అవసరం అతనికి ఉండదని నాకు తెలుసు. అతను రోజూ తాగే విస్కీ ఖరీదు అయిదొందలనీ తెలుసు - నేనింకా ఏదో అనబోతుంటే..

'చెప్పాగా సోమవారం వచ్చి తీసుకెళ్ళు - అన్నట్టు కొత్త సీరియల్‌కు ఏమైనా పాయింట్ ఆలోచించావా?' అన్నారు.

దేవీ బిర్యానీ పాయింట్!

మధురానగర్‌లో కొత్తగా పెట్టిన హోటల్ గుర్తొచ్చింది. నోట్లో నీళ్ళూరాయి.

'లేడీస్‌లో మన పేరు బాగా పాపులర్ అయింది శేషు - ఈసారి సబ్జెక్ట్ కూడా లేడీ ఓరియంటెడ్ రాద్దాం - తొందరేంలేదు - తీరిగ్గా ఆలోచించు - ఓ అభిమాని లంచ్‌కు పిలిచింది - వెళ్ళాలి' అన్నారు లేచి నిలబడుతూ.

రోడ్డుమీదకొచ్చాను - కళ్ళు తిరుగుతున్నాయి. గొంతుక ఆర్చుకుపోతుంది. ఎదురుగా ఇరానీ హోటల్ నాకు ఫైవ్ స్టార్ హోటల్లా కనిపించింది. వెళ్ళి ఓ గ్లాసు నీళ్ళు తాగాలనుకున్నాను - అదృష్టం - నాలాటివారి కోసమే కాబోలు మంచినీళ్ళకు రేటులేదు ఫ్రీగా ఇస్తున్నారు. లోపలికెళ్ళి కుర్చీలో కూర్చుని నీళ్ళు తాగబోయి ఎదురుగా చూశాను. హోటల్ ముందు ఓ షాపులో ఈవారం పత్రిక వరుసగా వేలాడుతూ కనిపించింది. అది చక్రవర్తి ఇంట్లో నేను చూసిన పత్రిక. అదికాదు కదా చూస్తున్నది. ఆ పత్రిక మీద ప్రముఖ చిత్రకారుడువేసిన సరస్వతీ చిత్రం -

చూడలేక తలదించుకున్నాను-

సరస్వతీ నన్ను శపిస్తున్నట్ట నిపించింది!

నీళ్ళుతాగి టేబుల్‌మీద చేతులు మడిచి తల పెట్టి కళ్ళుమూసుకున్నాను. చక్రవర్తి.. కాదు.. ఎందరో చక్రవర్తులు నన్నుచూసి నవ్వుతున్నారు!!

(అంకితం: చక్రవర్తిలాటి కొందరు 'కమర్షియల్ రచయితలకు కసిగా.. భక్తితో..!!)



వచ్చేవారం కథ
ముగ్గురు మిత్రులు
-కాలువ మల్లయ్య